ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
7
శుక్రవారం 15 ఆగస్టు 2025

జగన్‌కు పులివెందులలో రప్పా..రప్పా

- జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైసీపీకి చావుదెబ్బ
- పులివెందులలో 6,033 ఓట్లతో టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి విజయం
- వైసీపీకి డిపాజిట్ గల్లంతు
- ఒంటిమిట్టలో 6,267 ఓట్లతో అద్దలూరి ముద్దుకృష్ణారెడ్డి గెలుపు
- టీడీపీలో నయాజోష్

రప్పా రప్పా.. ఇది ఇప్పుడు వైసీపీ ట్యాగ్‌లైన్. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నేతలను రప్పా రప్పా నరికేస్తామంటూ జగన్‌పార్టీ ఇటీవల ప్రచారం చేసుకుంటోంది. వచ్చే ఎన్నికల్లో గెలుపు సరే.. ఇప్పుడు సొంతూరు పులివెందులలో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటర్లే జగన్ పార్టీని రప్పా రప్పా ఆడించి జెండాను తిరగేశారు. తొలిసారిగా జగన్ కోటలో పసుపు జెండాను నాటారు. ఎంతలా అంటే అసలు టీడీపీ నేతలే ఊహించని రీతిలో 6,033 ఓట్ల భారీ మెజార్టీతో టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి విజయాన్ని అందుకున్నారు. వైసీపీకి డిపాజిట్టే దక్కనివ్వకుండా సొంతూరు జనం రప్పా రప్పా అంటూ రఫ్ఫాడించారు. పులివెందుల తీర్పులాగానే ఒంటిమిట్ట ప్రజలు టీడీపీ అభ్యర్థి అద్దలూరు ముద్దుకృష్ణారెడ్డిని 6,267 ఓట్ల ఆధిక్యంతో గెలిపించారు.


పులివెందుల జడ్పీటీసీగా మారెడ్డి లతారెడ్డి విజయం సాధించడంతో కడపలో కేక్ కట్ చేస్తున్న జిల్లా ఇన్‌చార్జిమంత్రి సవిత, చిత్రంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, కృష్ణచైతన్యరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి తదితరులు

(కడప-ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలు రాష్ట్ర వ్యాప్తంగా బాగా ఆసక్తిని రేపాయి. ఇటు మీడియాలోనూ, అటు సోషల్ మీడియాలో ఎన్నికలపై విస్తృతంగా ప్రచారం జరిగింది. ముఖ్యంగా పులివెందుల ఉపఎన్నికపై జనం బాగా ఫోకస్ పెట్టారు. అలా హై ఓల్టేజీగా ఈ ఎన్నికలు మారాయి. ఫలితాలు కూడా అదే స్థాయిలో వచ్చాయి. సొంతూరు పులివెందులలో డిపాజిట్ కోల్పోయి ఘోరంగా ఓడిపోవడం, ఒంటిమిట్టలోనూ పరాజయం పొందడంతో జగన్ పార్టీకి ఈ ఓటమి చావుదెబ్బ అని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. టీడీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని వైసీపీ ఆరోపించినా.. సొంత జిల్లాలో ముఖ్యంగా సొంత ఊరిలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ వన్‌సైడ్‌గా దొంగ ఓట్లు వేసే అవకాశం ఉంటుందా..? బలంగా ఉన్న వైసీపీ దొంగ ఓట్లను అడ్డుకోకుండా ఉంటుందా అనే చర్చ నడుస్తోంది.

వైసీపీకి చావుదెబ్బ

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు వైసీపీకి ఓ విధంగా చావుదెబ్బ లాంటిదని విశ్లేషకులు భావిస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది తరువాత జరిగిన ఉప ఎన్నికలు ఇవి. ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారంటూ జగన్ పార్టీ బాగా ప్రచారం చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో ఈ రెండు ఉప ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే ఫలితాలు చూస్తే ఇవి వైసీపీకి పొలిటికల్‌గా తీవ్ర డ్యామేజీ చేశాయి. గురువారం కడప నగర శివారులోని మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్శిటీలో ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు మొదలైంది. జేసీ అదితిసింగ్, ఎస్పీ అశోక్‌కుమార్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జడ్పీ సీఈవో ఓబులమ్మ పర్యవేక్షణలో కౌంటింగ్ మొదలైంది. పులివెందుల జడ్పీటీసీ స్థానానికి ఒక రౌండులో పది టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక రౌండుగా నిర్ణయించారు.

మొత్తం 7,794 ఓట్లు పోల్ అవగా 7,638 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. 145 ఓట్లు తిరస్కరిస్తే 11 ఓట్లు నోటాకు పడ్డాయి. ఇందులో టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డికి 6,716 ఓట్లు రాగా వైసీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డికి 683 ఓట్లు వచ్చాయి. 6,033 ఓట్ల ఆధిక్యంతో టీడీపీ అభ్యర్థి విజయం సాధించారు. ఇక కాంగ్రెస్ నుంచి పోటీలో ఉన్న శివకళ్యాణ్‌రెడ్డికి 101 ఓట్లు రాగా, స్వతంత్ర అభ్యర్థులు సురేశ్‌కుమార్‌కు 4, తుమ్మలూరు అనిల్‌కుమార్‌రెడ్డికి 1, నాగెండ్ల సాంబశివారెడ్డికి 0, భూమిరెడ్డి రవీంద్రరెడ్డికి 14, ఎం.గజేంద్రనాథరెడ్డికి 79, భరత్‌రెడ్డికి 35, వెంగళరెడ్డికి 3, సునీల్‌యాదవ్‌కు 2 ఓట్లు వచ్చాయి.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్టలో టీడీపీ నుంచి అద్దలూరు ముద్దుకృష్ణారెడ్డి పోటీ చేయగా వైసీపీ నుంచి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి బరిలో నిలిచారు. 20,467 ఓట్లు పోల్ కాగా 19,836 ఓట్లు చెల్లాయి. 602 ఓట్లు తిరస్కరించారు. 29 ఓట్లు నోటాకు పడ్డాయి.

ఇక టీడీపీ అభ్యర్థికి 12,780 ఓట్లు, వైసీపీ అభ్యర్థికి 6,513 ఓట్లు వచ్చాయి. వైసీపీపై టీడీపీ అభ్యర్థి 6,267 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఇక పి.విజయభాస్కర్‌కు 146, చంద్రనాథ్‌కు 23, వెంకటరమణకు 18, మల్లికార్జునరెడ్డికి 2, శివారెడ్డికి 148, సుధాకర్‌కు 16, మధుమూర్తికి 179, ఈశ్వరయ్యకు 2, వెంకటేశ్‌కు 9 ఓట్లు పోల్ అయ్యాయి. గెలుపొందిన అభ్యర్థులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఓబులమ్మ డిక్లరేషన్ పత్రాలను అందించారు. ఉదయం 11గంటలలోపు పులివెందుల ఫలితాలు రాగా.. ఒంటిగంటలోపు ఒంటిమిట్ట ఫలితాలు వెలువడ్డాయి. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ అశోకుమార్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందుగా ప్రకటించినట్లు వైసీపీ కౌంటింగ్‌ను బహిష్కరించింది.

ప్రజాస్వామ్యానికి ఊపిరి



జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ విజయం ప్రజాస్వామ్యానికి ఊపిరి లాంటిది. నాలుగు దశాబ్దాల తరువాత పులివెందుల ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇన్నిరోజులు ఓటు హక్కును హరించి వేశారు. కూటమి పాలనలో ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. టీడీపీ సంక్షేమ పథకాలు మా గెలుపునకు కారణమయ్యాయి. వైసీపీ అభ్యర్థిపై 6,033 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించా. ప్రజల తరపున ప్రజల కోసం పనిచేస్తాం.

- మారెడ్డి లతారెడ్డి, పులివెందుల జడ్పీటీసీ సభ్యురాలు

వైసీపీకి బుద్ధిచెప్పారు



ఒంటిమిట్ట మండల ఓటర్లు జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైసీపీకి గట్టిగా బుద్ధి చెప్పారు. వైసీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిపై 6,267 ఓట్ల మెజార్టీతో ప్రజలు నన్ను గెలిపించి 30 ఏళ్ల చరిత్రను తిరగరాశారు. వైసీపీ అరాచకాలు పనిచేయలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలే మా గెలుపునకు సోపానాలుగా నిలిచాయి. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా బాధ్యతగా వ్యవహరిస్తా.

- అద్దలూరు ముద్దుకృష్ణారెడ్డి, ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యుడు

టీడీపీలో నయా జోష్

ఉమ్మడి జిల్లాలోని రెండు జడ్పీటీసీ స్థానాలను టీడీపీ భారీ మెజార్టీతో గెలుచుకోవడంతో ఆ పార్టీ నేతల్లో నయాజోష్ నెలకొంది. పులివెందుల, ఒంటిమిట్ట కడప జిల్లాలో ఉన్నప్పటికీ ఒంటిమిట్ట అన్నమయ్య జిల్లాలోని రాజంపేట నియోజకరవర్గం పరిధిలో ఉంది. ఈ రెండు స్థానాల గెలుపు కోసం కడప, అన్నమయ్య జిల్లాల్లోని టీడీపీనేతలు ముమ్మరంగా ప్రచారం నిర్వహించి వ్యూహాలు అమలు పరిచారు. పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కూటమి నేతలు అహర్నిశలు కష్టపడ్డారు. ముఖ్యంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నీ తానై రాజకీయ వ్యూహాలు నడిపించి తనదైన మార్కును చూపించారు. పులివెందుల గెలుపు కోసం మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పుత్తా చైతన్యరెడ్డి, ఆర్.మాధవి, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి కలిసికట్టుగా నడిచారు. ఇక అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ ఇతర బీజేపీ, జనసేన నాయకులు సైతం టీడీపీ అభ్యర్థి గెలుపు కోసం పోరాడారు.

ఒంటిమిట్ట ఎన్నికలో విజయం కోసం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, మంత్రి ఫరూక్ అబ్దుల్లా భుజస్కంధాలపై వేసుకుని ప్రచారం నిర్వహించారు. అభ్యర్థి ఎంపిక, ప్రచారంలో ఆలస్యమైనా మైండ్ బ్లాక్ అయ్యే విజయాన్ని అందించారు. ఈ రెండు చోట్ల విజయాలతో టీడీపీలో నయాజోష్ నెలకొంది.

స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు


పోలీసుపరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లు

కడప క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలకు సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణంలోని పరేడ్ మైదానాన్ని అధికారులు ముస్తాబు చేశారు. స్టేజీ డెకరేషన్‌తో పాటు అతిథులకు, వీఐపీలకు, విద్యార్థులకు కూర్చుని సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించేలా కుర్చీలు వేశారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన శకటాలు ఏర్పాటు చేశారు. గురువారం వర్షం పడడంతో గ్రౌండ్ మొత్తం నీరు చేరింది. దీంతో పోలీసు సిబ్బంది ఇతర శాఖల సిబ్బంది గ్రౌండులో నీటిని తొలగించి గ్రావెల్ వేశారు. మంత్రి ఫరూక్ ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. ఉదయం 9గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. అతిథుల సందేశం, స్వాతంత్ర్య సమరయోధులకు సత్కారం, ప్రగతి శకటాల ప్రదర్శన, పోలీసు డాగ్, అగ్నిమాపక శాఖల ప్రదర్శన, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం ఉత్తమంగా విధులు నిర్వహించిన ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించనున్నారు.


మైదానంలో అతిథుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు

జిల్లా పోలీసులకు సేవా పతకాలు

కడప క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసులకు ఉత్తమ సేవా, మహోన్నత సేవ పతకాలు లభించాయి. పోలీసుశాఖతో పాటు అగ్నిమాపక శాఖ, లెవన్త్ బెటాలియన్ సిబ్బందికి ఈ పతకాలు లభించాయి. విధుల్లో సత్తా చాటిన పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా వివిధ పతకాలతో సత్కరిస్తూ ఉంటుంది. ఈ క్రమంలో ఆగస్టు 15 సందర్భంగా పలువురికి ఈ సేవా పతకాలు ప్రటించింది.

పతకాలు వీరికే..

- **మహోన్నత సేవా పతకం :** లెవెన్త్ బెటాలియన్‌లో పనిచేస్తున్న నాగలక్షుమయ్య, ఆర్ఎస్ఐ రమణారెడ్డికి ప్రకటించారు.
- **సేవాపతకం :** సీఐ ఎం.నాగభూషణం (బద్వేలు రూరల్), ఇంటలిజెన్స్ సీఐ అనిల్‌కుమార్, ఏఎస్ఐలు మురళీయాదవ్, చక్రపాణి, లెవెన్త్ బెటాలియన్‌లో పనిచేస్తున్న ఆర్ఎస్ఐ రామ్మోహన్, హెడ్‌కానిస్టేబుళ్లు బీసీ సుబ్బారెడ్డి, నాగార్జునయ్య, లక్షుమయ్య, ఏఆర్ఎస్ఐ సుబ్బరాయుడు ఉన్నారు. అగ్నిమాపక శాఖలో లీడింగ్ ఫైర్‌మెన్ సుబ్బయ్య, మహబూబ్ బాషాతో పాటు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఏవీ రమణ, ఏఎస్ఐ డి.శేషశయనరావు (చక్రాయపేట), హెడ్‌కానిస్టేబుల్ వెంకటరమణయ్య (కడప రిమ్స్), ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు వెంకటరత్నం, గురవయ్య, కానిస్టేబుల్ సునీల్ (చాపాడు) ఉన్నారు.
- **ఉత్తమ సేవాపతకం:** అగ్నిమాపక జిల్లా అధికారి ధర్మారావు, ఏఎస్ఐ శివశంకరయ్య (కడప వన్‌టౌన్), అడిషనల్ కమాండర్ నాగేశ్వరప్ప, ఆర్ఎస్ఐ రాఘవరెడ్డి (లెవెన్త్ బెటాలియన్)లకు ప్రకటించారు.

నేడు స్త్రీశక్తి పథకం ప్రారంభం

కడప మారుతీనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన స్త్రీశక్తి పథకం అమలులో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో శుక్రవారం నుంచి ఉచిత ప్రయాణం కల్పించనున్నామని ఆర్టీసీ ఆర్ఎం పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్త్రీశక్తి పథకాన్ని శుక్రవారం సాయంత్రం 5గంటలకు విజయవాడలో ప్రారంభిస్తారని వెల్లడించారు. అనంతరం కడప నూతన గ్యారేజీలో మంత్రి ఫరూక్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ హాజరై ఈ పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు.

ఇక పులివెందుల మాదే : మంత్రి

కడప మారుతీనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వచ్చే సాధారణ ఎన్నికల్లో సైతం పులివెందులలో టీడీపీ జెండా రెపరెపలాడిస్తామని, ఇక పులివెందుల తమదేనని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలుపొందడం ప్రజా స్వామ్య విజయంగా భావిస్తున్నామన్నారు. గురువారం ఓట్ల లెక్కింపు జరిగి విజేతలను ప్రకటించిన అనంతరం.. కడపలోని హరిప్రియ హోటల్‌లో పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్‌రవి, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కమలా పురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, జమ్మల మడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డితో కలిసి మంత్రి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గతంలో పులివెందులలో రిగ్గింగ్, ఏకగ్రీవాలతో వైసీపీ నాయకులు గెలిచేవారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పులివెందులలో ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేశారన్నారు. అక్కడి ప్రజ లంతా టీడీపీకి ఓట్లు వేసి వైసీపీని ఏకంగా బాయ్‌కాట్ చేశారన్నారు. వచ్చే ఎమ్మెల్యే ఎన్నికల్లో పులివెందులనూ గెలుచుకుంటామన్నారు.

దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయండి

- కేంద్ర బలగాలతో ఎన్నికలకు వెళ్దాం
- జగన్‌కు టీడీపీ జిల్లా అధ్యక్షుడి సవాల్

కడప రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): "వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. కేంద్ర బలగాలతో ఎన్నికలకు వెళ్దాం. గెలుపెవరిదో తెలుస్తుంది" అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సవాల్ విసిరారు. గురువారం జడ్పీటీసీ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద వారు మీడియాతో మాట్లాడారు. ఎన్నికల బాయికాట్ వైసీపీ డ్రామా అన్నారు. పులివెందులలో ట్రెండ్ మారిపోయిందన్నారు. అక్కడి ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్నారన్నారు. ఇందుకు జడ్పీటీసీ ఉప ఎన్నికలే నిదర్శనమన్నారు. టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి ఘన విజయం సాధించారన్నారు. ఈ విజయం పులివెందుల ప్రజలది, ప్రజాస్వామిక వాదులదన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును వైసీపీ అంగీకరించకపోగా కేంద్ర బలగాలతో ఎన్నికలను నిర్వహిస్తే తెలుస్తుందనడం వారి డాంబికానికి నిదర్శనమన్నారు.

మేయర్‌కు మరోసారి నోటీసులు

- ఇదే చివరి అవకాశం

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కడప నగర మేయర్ సురేశ్‌బాబుకు రాష్ట్ర పుర పాలక శాఖ ముఖ్య కార్యదర్శి నుంచి గురు వారం తుది అవకాశం కల్పిస్తూ మళ్లీ నోటీ సులు జారీ అయ్యాయి. సెప్టెంబర్ 3వ తేదీన వెలగపూడిలోని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ కార్యాలయానికి రావాలని నోటీసులో పేర్కొన్నారు. కడప కార్పొరేషన్ మేయర్ సురేశ్‌బాబుకు పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గురువారం నోటీసు జారీ చేసింది. వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ పేరుతో మేయర్ కుటుంబీకులు నగరపాలక సంస్థలో కాంట్రాక్ట్ పనులు చేపట్టడం పురపాలక చట్టాలకు విరుద్ధమన్నారు. ఈ నిబంధనలు అమలు చేస్తూ మేయర్ సురేశ్‌బాబుని పదవి నుంచి తొలగించి నట్లు మే 14న పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై మేయర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సురేశ్‌బాబు తన వాదనలను వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని జూలై 18న కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో మే14వ తేదీన జారీ చేసిన నోటిఫికేషన్‌ను పురపాలకశాఖ రద్దు చేసింది. మళ్లీ తన వాదనను వినిపించాలని తాజాగా ఈనెల 7వ తేదీన నోటీస్ జారీ చేసింది. అయితే మేయర్ గడువు కోరడంతో తుది అవకాశం కల్పిస్తూ సెప్టెంబరు 3వ తేదీన హాజరుకావాలని గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మహనీయుల త్యాగాలు మరువకూడదు

- స్వాతంత్ర్య ఫలాలు అందరివీ
- దేశాభివృద్ధిలో యువతే కీలకం
- నైతిక విలువలు కోల్పోతే సమాజమే సమాధి
- స్వాతంత్ర్య సమరయోధులు పెడబల్లె బాలయల్లారెడ్డి


స్వాతంత్ర్య సమరయోధుడు పెడబల్లె బాలయల్లారెడ్డి

చెన్నూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలను తృణప్రాయంగా పెట్టి మనకు స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుల త్యాగాలు మరిచిపోకూడదని, ఈ నాటి స్వేచ్ఛ వారి త్యాగాల ఫలితమే అని స్వాతంత్ర్య సమరయోధుడు పెడబల్లె బాలయల్లారెడ్డి అన్నారు. జిల్లాలో ప్రస్తుతం జీవించి ఉన్న ఏకైక స్వాంత్ర్య సమర యోధుడు ఈయనే. 105ఏళ్ల వయసులో కూడా స్వాతంత్ర్య దినోత్సవం వచ్చిందంటే ఆయనలో ఎక్కడ లేని ఆనందం, భావోద్వేగం కనిపిస్తాయి. ఆంధ్రజ్యోతి ఆయనను పలకరించగా.. నాటి స్మృతులు, పడ్డ కష్టాలు, యువకునిగా అప్పట్లో తాను బ్రిటీషు వారి ఆగడాలను ఎదుర్కోవడానికి తనతోటి స్వాతంత్ర్య సమరయోధులతో కలిసి చేసిన పనులు చెప్పుకొచ్చారు. నాటి అనుభవాలు, నేటి దేశ పరిస్థితి గురించి ఆయన మాటల్లోనే..

కాజ్‌వే పగలకొట్టాం

బ్రిటీషు వారితో పెద్ద పోరాటాలు చేయకపోయినా మావంతుగా దేశం కోసం తెల్ల దొరలను కొంతమేర ఎదిరించి వారి పనులకు అడ్డుకట్ట వేయించాము. మండలంలో మొత్తం 18 మంది స్వాతంత్ర్య సమరయోధులు ఉండేవారు. 1943-44 ప్రాంతంలో చెన్నూరులో ఉన్న పెన్నా లోలెవల్ కాజ్‌వే మీదుగా బ్రిటీషు వారు రాకపోకలు సాగించకుండా రెండు చోట్ల కాజ్‌వేను పగలగొట్టాం. అప్పట్లో పెన్నాపై హైలెవెల్ వంతెన ఉండేది కాదు. కడప నుంచి నంద్యాల, కర్నూలు, హైదరాబాదు వెళ్లాలంటే ఈ చెన్నూరు వద్ద గల లోలెవల్ కాజ్‌వే దాటి వెళ్లాలి. అందుకే వారిని కడప వైపు రానివ్వకుండా కాజ్‌వేపైన రెండు చోట్ల పగలకొట్టి పెద్ద పెద్ద రాళ్లు తొలగించాం. దీంతో బ్రిటీషువారు కోపంతో మమ్మల్ని పట్టుకోవాలని జైల్లో పెట్టాలని ప్రయత్నించగా ఇతర సమరయోధులు, యువత కలిసి వారిని అడ్డుకున్నారు. అలా దేశం కోసం నావంతుగా చిన్నపాటి సాయమందించా.

నైతిక విలువలు కోల్పోతే సమాధే

ప్రజలు నైతిక విలువలు కోల్పోతే సమాజమే సమాధి అవుతుంది. ఎవరిలో అయితే, ఎక్కడైతే నైతిక విలువలు ఏమాత్రం దిగజారకుండా ఉంటాయో అక్కడ అభివృద్ధి ఉంటుంది. నీతి నిజాయితీ నిండి ఉంటాయి. నేడు టీవీల్లో నేతల ప్రసంగాలు, అప్పుడప్పుడూ ప్రచారాలు చూస్తున్నా.. ఏమిటివి? దేశానికి ఉపయోగపడేవేనా అన్న విధంగా మనసుకు అనిపిస్తుంటుంది. వాస్తవ పరిస్థితుల్లో సమాజం మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. నాయకుల మాటలతో మభ్య పెట్టకుండా చేతలతో అభివృద్ధిని చూపిస్తూ దేశం కోసం పాటుపడాలి. అంతర్గత శత్రువులు నాటి నుంచి నేటి వరకు ఉంటున్నారు. వారిని నిర్దాక్షిణ్యంగా ఏరివేయాలి. అటువంటి వారు ఎవరైనా సరే ఉపేక్షించరాదు. యువత అన్నివిధాలుగా చైతన్యవంతులు కావాలి. దేశ సమగ్రతకు బాటలు వేయాలి. జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

దేశభక్తి నూరిపోసేవారు

దేశాభివృద్ధిలో నాటి నుంచి నేటి వరకు యువతే కీలకం. నాడు పెద్దలు దేశభక్తి గీతాలు, చరిత్రలు, గొప్పగొప్ప వారి కథలు చెబుతుంటే విని యువ రక్తం పొంగి బ్రిటీషు వారిపై తిరగబడ్డారు. యువతలో ప్రేరణ కలిగించేందుకు ఎందరో గొప్ప గొప్ప వారి చరిత్రలు ఊరు వాడ వినిపించేవారు. పైగా మదనపల్లెలాంటి ప్రాంతాల నుంచి గొప్ప వ్యక్తులు వచ్చేవారు. దూర ప్రాంతాల నుంచి కూడా చెన్నూరుకు వచ్చి రాత్రివేళ దేశభక్తి గురించి యువతలో నూరి పోసేవారు. అందుకే యువత ఉత్తేజితమై బ్రిటీషు వారిని ఎదుర్కోగలిగాం.

స్వాతంత్ర్య ఫలాలు అందరివీ

స్వాతంత్ర్యం కోసం కులమత జాతి భేదం లేకుండా పోరాడాం. ఈ పోరాటంలో ఎందరో పాల్గొన్నారు. వారి పోరాట ఫలితమే నేటి స్వాతంత్ర్య ఫలాలి. అందుకే అవి కొందరివి కాదు అందరివీ. అందరికీ సమానంగా అందాలి. అయితే నేడు కులం, జాతిలాంటివే సమాజాన్ని నడిపించే పరిస్థితి రావడం బాధ కలిగిస్తుంది. ఇది మంచి పద్ధతికాదు, దేశాభివృద్ధికి అడ్డంకి.

దండలు దండాలతోనే సరి

జిల్లాలో జీవించి ఉన్న సమరయోధుడు పెడబల్లె బాలయల్లారెడ్డి ఒక్కరే. ఆగస్టు 15 వచ్చినప్పుడల్లా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు రావడం శాలువాలు కప్పడం, మెడలో పూలదండలు వేయడం, నమస్కారాలతో సరిపెడుతున్నారు. ఒక్కగానొక్క సమరయోధుడు జీవించి ఉన్నాడు. ఆయన కుటుంబానికి కాస్తంత ఆసరా కల్పిస్తాం అన్న ఆలోచన మాత్రం నేటికీ ఎవరికీ లేదు. ఇంటిస్థలం ఇవ్వాలంటూ ఎన్నోమార్లు ఆయన విన్నవించగా 6 సెంట్ల స్థలం.. అదీ చలమారెడ్డిపల్లె గుట్టమీద ఇచ్చారు. 100 సంవత్సరాలు దాటిన వ్యక్తికి గుట్టమీద స్థలం ఇస్తే ఎలా..? గుట్టమీద కాకుండా ఊర్లో లేదా ఊరికి సమీపంలో స్థలం ఇవ్వాలని స్వాతంత్ర్య సమరయోధుడు కోరుతున్నారు.


నాడు అరాచకం..

- నేడు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు
- నాడు ప్రత్యర్థులను నామినేషన్లు వెయ్యనివ్వని వైనం...
- నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న వైసీపీ నేతలు
- వైసీపీ ద్వంద్వనీతి.. విస్తుపోతున్న జనం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ప్రతిపక్షాలను తొక్కేశారు.. తామేమి చేసినా ఎదురు చెప్పకూడదన్నట్లు వ్యవహరించారు. ప్రజాస్వామ్యం అనే పేరు కూడా వినడానికి ఒప్పుకోలేదు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ముఖ్యనాయకులు ఎందరినో జైళ్లకు పంపించారు. మున్సిపాలిటీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ వంటి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలను కనీసం నామినేషన్లను కూడా వేయనీయలేదు. దౌర్జన్యంగా నామినేషన్ల పత్రాలను చించేసి ప్రశ్నించిన వారిపై దాడులు చేశారు. పోలీసులను అడ్డు పెట్టుకుని.. నామినేషన్లు వేయాలని చూసిన వారి మీద అక్రమ కేసులు బనాయించారు. దాదాపు 98 శాతానికి పైగా స్థానాలను ఏకగ్రీవంగా గెలుచుకున్నారు.

ప్రస్తుతం పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీలకు జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిచారు. దీంతో రాష్ట్రంలో జగన్‌తో పాటు వైసీపీ నాయకుల నోట పదేపదే వినిపిస్తున్న మాట ప్రజాస్వామ్యం. ఇంతగా జగనన్న ప్రజాస్వామ్యం గురించి తపించడానికి కారణం తాము అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. గతంలో జరిగిన ప్రజా వ్యతిరేక పనులపై కేసులు పెట్టడం.. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేసుకోవడం.. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ నాయకులు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారు. జగనన్న ఐదేళ్ల పాలనలో ప్రజాస్వామ్యం ఏ విధంగా పరిఢవిల్లిందో.. చెప్పడానికి కింద కొన్ని ఉదాహరణలు.

నామినేషన్ వేయనివ్వకుండా దాడి


వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన గాజుల ఖాదర్‌బాష (ఫైల్)

2021లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రాయచోటి మున్సిపాలిటీలో నామినేషన్ వేయడానికి వస్తున్న టీడీపీ నాయకుడు గాజుల ఖాదర్‌బాషపైన అప్పట్లో వైసీపీ నాయకులు దాడి చేసి నామినేషన్ పత్రాలు చింపేశారు. రక్తగాయాలైన ఖాదర్‌బాషా పైనే 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. నామినేషన్లు వేయడానికి వచ్చిన పలువురిని పోలీసుల సాయంతో అడ్డుకున్నారు. ఏదో విధంగా నామినేషన్ వేసిన వాళ్ల నామినేషన్ పత్రాలను మున్సిపల్ కార్యాలయంలోనే చింపేశారు. 34 వార్డులు ఏకగ్రీవంగా గెలుచుకున్నారు. రాజంపేట మున్సిపాలిటీలో కొన్ని స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మదనపల్లె మున్సిపాలిటీలో 35 వార్డులకు గానూ.. 15 వార్డులను ఏకగ్రీవం చేసుకున్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ అన్నీ ఏకగ్రీవమే

అన్నమయ్య జిల్లాలోని 30 మండలాల్లో అన్ని జడ్పీటీసీ స్థానాలూ వైసీపీ ఏకగ్రీవంగా గెలుచుకుంది. గుర్రంకొండలో మాత్రం ఎన్నిక జరగ్గా వైసీపీ గెలిచింది. అదే విధంగా ఎంపీటీసీ స్థానాలను పరిశీలిస్తే.. మదనపల్లె నియోజకవర్గంలో 50 స్థానాలకు 49 వైసీపీ ఏకగ్రీవంగా గెలుచుకుంది. ఒక స్థానాన్ని టీడీపీ గెలుచుకుంది. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 73 ఎంపీటీసీ స్థానాలకు గానూ 72 వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. ఒక స్థానంలో ఇండిపెండెంట్ గెలిచారు. పీలేరు నియోజకవర్గంలో 59 ఏకగ్రీవం అయ్యాయి. 23 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. రాయచోటి నియోజకవర్గంలో 61 స్థానాలు వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. రాయచోటి మండలంలో ఒకటి, గాలివీడులో 2, లక్కిరెడ్డిపల్లెలో మూడు స్థానాలను టీడీపీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచింది. రాజంపేట నియోజకవర్గంలో 69 స్థానాలకు గానూ 61 వైసీపీ ఏకగ్రీవం చేసుకుంది. ఎన్నికలు జరిగిన చోట తెలుగుదేశం రెండు, బీజేపీ ఒక చోట గెలిచింది. ఒంటిమిట్ట స్థానంలో ఏకగ్రీవంగా గెలిచిన ఆకేపాటి అమర్‌నాథరెడ్డి జడ్పీ చైర్మన్‌గా పని చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో 74 స్థానాలకు గానూ 49 ఏకగ్రీవం చేసుకున్నారు. దీనిని బట్టి చూస్తే వైసీపీ హయాంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఏమాత్రం ఉండేదో అర్థం అవుతుందని, అయితే ఇవేవీ గుర్తు లేనట్లు.. జగన్ అండ్ కో నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ


తహసీల్దారుతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ భావన

పెనగలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజంపేట సబ్‌కలెక్టర్ భావన గురువారం మండల రెవెన్యూ కార్యాలయ, మండల పరిషత్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లో రికార్డు గదులను, సిబ్బంది హాలును, పరిసర ప్రాంతాలను కలియదిరిగారు. రెండు కార్యాలయాల్లో సిబ్బందిని పరిచయం చేసుకుంటూ ఎవరెవరు ఏయే పనులు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తహసీల్దారు అమరేశ్వరి, ఎంపీడీవో విజయరావు అన్నారు.

చట్టంపై అవగాహన ఉండాలి

జిల్లా సూక్ష్మనీటి సాగు అధికారిణి లక్ష్మిప్రసన్న

రాయచోటి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం-2005పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న తెలిపారు. గురువారం రాయచోటి పట్టణ పరిధిలోని ఏపీఎంఐపీ జిల్లా కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బంది, ఇంజనీర్లు, జిల్లా కో-ఆర్డినేటర్స్, కంప్యూటర్ ఆపరేటర్లకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 సంవత్సరం మే నెలలో పార్లమెంట్‌లో ఆమోదం పొంది అమల్లోకి వచ్చిందన్నారు. ఈ సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం కోసం అధికార యంత్రాంగం అదుపులో ఉన్న సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు తీసుకొచ్చారన్నారు. అదేవిధంగా పౌరులకు ముఖ్యమైన ఆయుధం అని, ఈ చట్టాన్ని ఉపయోగించి ప్రజలు హక్కులను కాపాడుకోవచ్చని తెలిపారు.

అసంపూర్తి ఇళ్లను త్వరగా పూర్తి చేయండి

కొత్తపల్లె గృహ లబ్ధిదారులతో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి ● తహసీల్దారు కార్యాలయాల తనిఖీ

కలికిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తప ల్లె గృహ నిర్మాణ కాలనీలో ఇళ్లను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి ఆదేశించారు. మం డలంలో పలు చోట్ల ఆమె పర్యటించారు. ఎమ్మార్వో కార్యాలయంలో ఉద్యోగుల పని తీరు, రికార్డుల నిర్వహణను పరిశీలిం చారు. కుల ధృవీకరణలాంటి ధృవ పత్రా లను వెంటనే జారీ చేయాలన్నారు. కలికి రి-3 సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ఉద్యోగుల హాజరు, ఇతర రికార్డుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. కలికిరి కొత్తపల్లె గృహ నిర్మాణ కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడారు. నాలుగేళ్లగా మొండి గోడల స్థాయిలోనే వున్న ఇళ్లను పూర్తి చే సేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పం చాయతీ ఆధ్వర్యంలోని చెత్త సంపద (డంపింగ్ యార్డు) కేంద్రం నిర్వహణను పరిశీలించారు. చెత్త ద్వారా వర్మీ కంపోస్టు తయారీకి చేపట్టిన చర్యలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ రి యాజుద్దీన్ అహ్మద్, తహసీల్దారు హరికుమార్, డీ టీ సయ్యద్ పంచాయతీ కార్యదర్శి జి.అశోక్, హా సింగ్ ఏఈ చంద్ర శేఖర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


కలికిరిలో ఇళ్లను పరిశీలించి సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ కళ్యాణి

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

రామసముద్రం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యో తి): తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ కళ్యాణి ఆకస్మికంగా తనిఖీ చే శారు. రికార్డులు పరిశీలించి రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్ మహ్మద్ అజారుద్దీన్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సోమవారం రెవెన్యూ సమస్యలపై అర్జీలన్నింటినీ త్వరగా పరిష్కరించాలని సిబ్బందికి సూచిం చారు. కార్యక్రమంలో ఆర్ఐ వ శీం అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ రెడ్డె ప్ప, మండల సర్వేయర్ నరేంద్ర, వీఆర్వోలు రెహ్మాన్, జగదీష్, రఘురామ్, అనూష, మమత, భారతి, గౌరీ, అనూ ష, సునీత, రమణ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే పక్కాగా నిర్వహించాలి

నిమ్మనపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో జరగుతున్న రీ-సర్వే పక్కాగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆమె ప్రభుత్వం విడుదల చేసిన అన్నదాత సుఖీభవ నిధులు రైతులకు చేరాయా అని వాకబు చేశారు. సిబ్బంది సూచించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

అనంతరం పీజీఆర్ఎస్ కార్యక్రమం తప్పకుండా నిర్వర్తించి రైతుల సమస్యను తీర్చాలన్నారు. రెవెన్యూ సిబ్బంది రీ-సర్వేలో అలసత్యం వహిస్తుండడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రీసర్వేలో అలసత్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తపస్విని, సర్వేయర్ గోపి, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటు బాధిత కుటుంబానికి రూ.4 లక్షలు విడుదల

కలికిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గత ఏప్రిల్ నెలలో పిడుగుపాటుకు గురై మరణించిన కడప జిల్లాకు చెందిన ఒక బాధిత కుటుంబానికి ప్రతిపాదనలు అందిన కేవలం వారం రోజుల్లోనే రూ.4 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని మీనాపురం గ్రామానికి చెందిన పెద్దమైసూరయ్య కుమారుడు చిట్టిబోయిన మునుస్వామి గత ఏప్రిల్ 30న పిడుగుపాటుకు గురయి మృతి చెందాడు. దీనికి సంబంధించి ఈ నెల 6న జిల్లా కలెక్టరు పరిహారం విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలందిన వెంటనే పరిహారం విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అన్ని ఆనవాయితీలను పూర్తి చేసి మునుస్వామి కుటుంబానికి పరిహారం అందజేయడానికి గురువారం విపత్తు సహాయ నిదుల నుంచి రూ.4 లక్షలు మంజూరు చేసి విడుదల చేసింది. జిల్లా కలెక్టరు తగిన చర్యలు తీసుకుని వెంటనే బాధిత కుటుంబానికి పరిహారం నిదులు బ్యాంకు ఖాతా ద్వారా నేరుగా చెల్లించాల్సిందిగా ఆదేశిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి గురువారం ఆదేశాలు జారీ చేశారు.

500 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ


జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

నందలూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ జాతీయ జెండాలను నిషేదించాలని ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలని సమాజ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు, అడ్వకేట్ వాండ్రాసి పెంచలయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి 500 అడుగుల భారీ జాతీయ జెండాతో జూనియర్ కళాశాల నుంచి అరవపల్లెలోని ఆర్అండ్‌బి బంగ్లా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ తయారు చేసిన జాతీయ జెండాలను వినియోగించరాదని జాతీయ జెండా ప్రాముఖ్యత కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతిఒక్కరిలో చైతన్యం రావాలని జాతీయ భారీ జెండాతో ర్యాలీ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, సమాజ సేవా సమితి విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి ఎస్కే జావిద్‌బాషా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యపూజకోన అభివృద్ధికి కృషి

● ఇన్‌చార్జి ఈవో శ్రీధర్


దారిలో ఉన్న బండరాళ్లను చూపుతున్న ఇన్‌చార్జ్ ఈవో

సిద్దవటం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వరకోనలోని అటవీ ప్రాంతంలో శివ భక్తులు కాలినడకన నడుచుకుంటూ వెళ్లే రహదారి అభివృద్ధికి కృషి చేస్తానని ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన సిద్దవటంలో గురువారం ఇన్‌చార్జి ఈవో మాట్లాడుతూ నిత్యపూజకోనలోని పంచలింగాల గుడి వద్ద నుంచి అటవీ ప్రాంతంలో కాలినడకన భక్తులు దర్శనానికి వెళ్లే రహదారి దాదాపు 3 కి.మీ. మేర పెద్ద పెద్ద బండలు ఉన్నాయన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల్లో శివదర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, గత ఏడాది జరిగిన ఉత్సవాల్లో రహదారి సరిగా లేక భక్తులు ఇబ్బంది పడినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. కాలినడకన వెళ్లే రహదారి ఏనుగులు గుంత సమీపాన పెద్ద పెద్ద గుండ్లు రహదారికి అడ్డంగా ఉన్నాయని ఫారెస్ట్ అధికారుల అనుమతులు తీసుకొని రహదారి అభివృద్ధికి సహకరిస్తానని ఇన్‌చార్జ్ ఈవో శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ సిబ్బంది చంద్ర పాల్గొన్నారు.

ఏపీఎంపై దాడి కేసులో ఇరువురి అరెస్టు

గుర్రంకొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీఎం రజనీకుమారిపై దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు. 12వ తేదీ విధి నిర్వహణలో ఉన్న ఏపీఎం రజనీకుమారిపై గుర్రంకొండ సంఘమిత్ర-3 పరిధి మహిళలు దాడి చేసి గాయపరచడంతో పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. కేసులో నిందితులైన శేఖర్, గంగిరెడ్డిని మార్కెట్ యార్డు వద్ద అరెస్టు చేసి వీరిని రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి


దేవేంద్ర (ఫైల్)

రాజంపేటటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని కొత్తబోయనపల్లెలో గురువారం తెల్లవారుజామున కారు ఢీకొని బీటెక్ విద్యార్థి దేవేంద్ర(19) మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. కొత్తబోయనపల్లెలో అన్నమాచార్య యూనివర్శిటీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న రాయచోటికి చెందిన దేవేంద్ర, తాడిపత్రికి చెందిన ఇశ్వాంత్, మరో విద్యార్థి కలిసి ఖర్చుల నిమిత్తం బుధవారం సాయంత్రం ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో క్యాటరింగ్ నిర్వహించేందుకు వెళ్లారు. పని పూర్తయిన తర్వాత విద్యార్థులు ఇద్దరు కలిసి బోయనపల్లెకు తిరిగి నడుచుకుంటూ వెళుతున్న సమయంలో రాజంపేట నుంచి నందలూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో దేవేంద్ర అక్కడికక్కడే మృతిచెందగా ఇశ్వంత్‌కు గాయాలు కావడంతో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు ఢీ... ఇద్దరు యువకులకు గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ- కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని రాయల్పాడు సమీపం గెజ్జనూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మదనపల్లె మండలం, చీకలబైలుకు చెందిన ఇద్దరు యువకులు గాయపడ్డారు. గురువారం కర్ణాటక రాష్ట్రం లో టైల్స్ పనికి వెళ్లి ఇంటికి బైక్‌పై తిరిగి వస్తున్న యువకులను మదనపల్లె నుంచి బెంగళూరు వైపు వెళుతున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో యువకులు రాజన్న (30), శశికుమార్(26) గాయప డ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రాయల్‌పాడు పోలీసులు కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు ఏజీపీల తొలగింపు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కలికిరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రెండు కోర్టుల్లో ప్రభుత్వ సహాయ న్యాయవాదులు (ఏజీపీ)గా పనిచేస్తున్న ఇద్దరిని తొలగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మదనపల్లె రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో ఏజీపీగా ఉన్న ఆర్.షాజహాన్, కడప జిల్లా మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పనిచేస్తున్న వి.జె.ఎన్.శర్మల సేవలను ఉపసంహరిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. మూడేళ్ల కాల వ్యవధితో 2022 సెప్టెంబరు 27వ తేదీ నియమించిన ఈ ఇద్దరు ఏజీపీలను పాలనాపరమైన సౌలభ్యం కోసం గడువులోగా తొలగిస్తున్న కారణంగా నిబంధనల ప్రకారం ఒక నెల ముందస్తు గౌరవ వేతనాన్ని చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. అంతేగాకుండా కేసులకు సంబంధించి ఎలాంటి ఆటంకం తలెత్తకుండా సమీప కోర్టుల్లోని ప్రభుత్వ న్యాయవాదులను ఇన్‌చార్జులుగా నియమించాలని కూడా ప్రభుత్వం సూచించింది. ఈ ముగ్గురి స్థానాల్లో కొత్త ఏజీపీల భర్తీ కోసం తగిన అభ్యర్థుల ప్యానల్ జాబితాను కూడా త్వరగా సమర్పించాలని కలెక్టర్లను ఆదేశిస్తూ ప్రభుత్వ న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఆదేశాలు జారీ చేశారు.

దళారులు మారరంతే...

- బొప్పాయి టన్ను రూ. 7 నుంచి 8 వేలు
- ధరలు తగ్గించి కొంటున్న దళారులు
- ధరలపై హెల్ప్‌లైన్‌కు రైతుల ఫిర్యాదులు
- ప్రతిరోజూ చెక్‌పోస్టుల వద్ద అధికారుల తనిఖీలు

రైల్వేకోడూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి ధరలపై రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధ, గురువారాలలో 7 మంది రైతులు హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారని కార్యాలయం అధికారులు తెలిపారు. ఫిర్యాదు చేసిన రైతులు లారీ నెంబర్లు, దళారుల ఫోన్ నెంబర్లు, రైతుల ఫోన్ నెంబర్లతో పాటు భూమి సర్వే నెంబర్లతో ఫిర్యాదు చేశారు. బొప్పాయి కాయలను టన్ను రూ.7 వేలకు తీసుకున్నారని తెలిపారు. దీనిపై సబ్ కలెక్టర్ రైల్వేకోడూరు రెవెన్యూ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలకు చెందిన అధికారులతో చర్చించారు. హెల్ప్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సబ్ కలెక్టర్‌కు నివేదిక అందిస్తున్నారు. కొందరు దళారులు టన్ను రూ.7 వేలు, మరికొందరు టన్ను రూ.8 వేలతో బొప్పాయి కాయలను కోస్తున్నారని హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేస్తున్నారని కార్యాలయం అధికారులు చెబుతున్నారు. చాలామంది రైతులు దళారుల దగ్గర ముందస్తుగా డబ్బులు తీసుకున్నారు. దీంతో భయపడి తక్కువ రేటుకైనా కాయలను అమ్ముకుంటే సొమ్ము అవుతుందని కోతలు చేయిస్తున్నారు. గట్టిగా వాదించే రైతుల తోటల్లో దళారీలు కోతలు కోయడం లేదని రైతులు వాపోతున్నారు. కోతలు పూర్తయిన తర్వాత దళారులు లెక్కలు చూస్తారు. చాలామంది దళారులు లెక్కలు వేసినప్పుడు టన్ను రూ.9 వేలతో కట్టిస్తామని చెబుతున్నారని, కొందరు రూ.7 వేలు, రూ.8 వేలతో చీటీలు రాయిస్తున్నారని రైతులు తెలిపారు. చాలా మంది రైతుల తోటల్లో కాయలు ఎక్కడ మాగిపోతాయన్న ఆలోచనతో ఎంత ధరకైనా సరే కోతలు చేయాలని దళారులకు చెబుతున్నారని తెలిసింది. దళారుల దగ్గర అప్పులు తెచ్చిన రైతులు మాత్రం నోరుమెదపడం లేదు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ టన్ను బొప్పాయి కాయలను రూ. 9 వేలకు తక్కువ లేకుండా కోతలు కోయాలని చెప్పినా 75 శాతం ఫలితం ఉన్నా మరో 25 శాతం దళారులు వినకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు చెబుతున్నారు. బొప్పాయి రైతుల కోసం సబ్ కలెక్టర్ భావన హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తే దళారులకు భయపడిన చాలామంది రైతులు పిర్యాదు చేయడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దళారులు వచ్చే ఏడాదిలో ముందస్తుగా అప్పులు ఇవ్వరని, గింజలు ఏర్పాటు చేయరని రకరకాలుగా రైతులను ఇబ్బందిపెడతారన్న భయంతో దళారులతో రైతులు చేతులు కలపక తప్పడం లేదని వినిపిస్తోంది. గత ఏడాది రోజుకు 200 లారీల్లో ఇతర నగరాలకు బొప్పాయి కాయలను ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం 60 నుంచి 70 లారీల్లో కాయలను ఎగుమతి చేస్తున్నారు. కాగా వచ్చే ఏడాది బొప్పాయి వ్యాపారం తారుమారుగా ఉండవచ్చని చాలామంది రైతులు చెబుతున్నారు. రైతులను ఇబ్బంది పెట్టే వాతావరణం ఉండవచ్చునని అంటున్నారు. రెవెన్యూ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారులు, సిబ్బంది ప్రతి రోజు బొప్పాయి లారీలను తనిఖీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఢిల్లీలో వర్షాలు కురుస్తున్నాయని అందువల్ల ధరలు తగ్గుముఖం పడుతున్నాయని దళారులు అంటున్నారు. ఢిల్లీ మార్కెట్ మూడు రోజుల పాటు బంద్ అవుతుందని పంపిన కాయలు కుళ్లిపోతాయని వారు అంటున్నారు. వ్యాపారం పుంజుకుంటే ధరలు పెరుగుతాయని అంటున్నారు. ఇక అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచిచూడాల్సి ఉంది.






లారీకి లోడింగ్ చేసిన బొప్పాయి కాయలు చిట్వేలి-రాపూరు సరిహద్దు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ధర తగ్గిందంటూ ప్రచారం చేస్తే కఠిన చర్యలు

● సబ్ కలెక్టర్ భావన

రాజంపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయి కాయల ధరలు తగ్గాయంటూ తప్పుడు ప్రచారం చేసిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ హెచ్ఎస్ భావన హెచ్చరించారు. గురువారం ఆమె మాట్లాడుతూ కిలో బొప్పాయిని రూ.9 నుంచి 10 రూపాయలకు కొనడానికి వ్యాపారులు సిద్ధంగా ఉన్నారన్నారు. అయితే కొందరు దళారులు 7 రూపాయలకు పడిపోతుందంటూ ప్రచారం చేయడం తగదన్నారు. ఈ విధంగా రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌కు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ధర తక్కువకు అడిగితే హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసిన వెంటనే వారికి న్యాయం చేస్తామని తెలిపారు.

పాత రేషన్ కార్డులకు స్వస్తి

- ఇక జిల్లాలో 5,78,841 స్మార్ట్ కార్డులు
- ఈనెలాఖరులోగా పంపిణీకి కసరత్తు
- సెప్టెంబరు 1 నుండి సరుకుల పంపిణీ



కడప కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖలో సమూల మార్పులకు కూటమి సర్కారు శ్రీకారం చుట్టింది. పేదలకు సబ్సిడీ బియ్యం, సరుకులు పారదర్శకంగా, సులభతరంగా సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టింది. గత జగన్ పాలనలో అనాలోచిత చర్యలకు రేషన్‌కార్డు లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. ఇంటి వద్దకే బియ్యం పథకం పేరుతో ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాల ద్వారా సరుకుల పంపిణీ అట్టర్‌ప్లాప్ అయింది. అప్పట్లో జారీ చేసిన రేషన్ కార్డులపై వైసీపీ ప్రచార పిచ్చిలో ఒక పక్క జగన్‌బొమ్మ, మరో పక్క ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిల బొమ్మలతో ముద్రించారు. అంతేకాకుండా లబ్ధిదారుల ఫొటో, పేర్లు కనిపించడం కష్టంగా ఉండేది. ఇలాంటి విధానాలపై దృష్టి సారించిన ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు పారదర్శకంగా బియ్యం, సరుకులు అందించేందుకు వీలుగా డిజిటల్ స్మార్ట్ కార్డుల ఇచ్చేం దుకు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదేండ్ల మనోహర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పాత రేషన్ కార్డులకు స్వస్తి పలుకు తూ ఆస్థానంలో జిల్లాలో 5,78,841 రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఏటీ ఎం కార్డుల తరహాలో డిజిటల్ స్మార్ట్ కార్డుల పంపిణీకీ కసరత్తు చేపట్టారు. ఈ నెలాఖరు 25 నుంచి 31లోగా జిల్లాలో పాత కార్డు దారులతో పాటు కొత్తగా అర్హత పొందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించనున్నారు.

డిజిటల్ స్మార్ట్ రేషన్‌కార్డు ఇలా...

ఇక డిజిటల్ స్మార్ట్ రేషన్‌కార్డు ఏటీఎం క్రెడిట్ కార్డు సైజ్‌లో క్యూ ఆర్ కోడ్‌తో ముద్రించారు. లబ్ధిదారులు బియ్యం, సబ్సిడీ సరుకులు తీసుకునే సమయంలో గతంలో సర్వర్ రాక ఈ పోస్ యంత్రాలతో ఇబ్బందులు ఉండేవి. ఇపుడు బయోమెట్రిక్ లేకుండా నేరుగా స్మార్ట్ కార్డులోని నెంబరు నమోదు చేస్తే లబ్ధిదారుల పూర్తి వివరాలు రానున్నాయి. ఈవిధానంలో కార్డుదారులు వెంటనే సరుకులు పొందే వీలుంటుంది.

జిల్లాలో కొత్తకార్డులు

జిల్లాలో 5,78,841 మంది లబ్ధిదారుల కుటుంబాలకు ప్రభుత్వం డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనుంది. వైసీపీ ప్రభు త్వంలో కొత్త రేషన్ కార్డులకు వేలాదిగా దరఖాస్తులు వచ్చినప్పటికీ కొత్తగా కార్డుల జారీ విషయంలో మీనామేషాలు వేసింది. దాదాపు రెండేళ్లపాటు నానబెట్టి పేదలను పథకాలకు దూరం చేసిందనే విమ ర్శలు ఉన్నాయి. 2024 ఎన్నికల ప్రక్రియ మొదలవ్వడంతో మెలిక పెట్టింది. నాటి నుంచి కొత్త రేషన్ కార్డులు, స్ప్లిట్టింగ్ కార్డులకు దర ఖాస్తులు క్రోడీకరించిన మీదట అర్హులుగా లెక్కించిన వారందరికీ చంద్రబాబు సర్కారు స్మార్ట్ కార్డులు అందజేయనుంది. ఇపుడు కూటమి సర్కారులో వచ్చిన 7,653 దరఖాస్తులను పరిశీలించి అర్హ త మేరకు 4,488 మందికి కొత్తగా రేషన్ స్మార్ట్ కార్డులందనున్నాయి. అలాగే స్ప్లిట్టింగ్ (సవరణలు, చేర్పులు, మార్పులు) కింద జిల్లాలో 10,269 దరకాస్తులు వచ్చాయి. అందులో 7453 కార్డులను సవరించి డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల రూపంలో అందించనున్నారు. ఈనెలా ఖరు నాటికి స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తయితే సెప్టెంబరు 1 నుంచి లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డుల ద్వారా బియ్యం, సరుకులు పంపిణీ జరగనుంది.



స్మార్ట్ రేషన్ కార్డులపై నేతల బొమ్మలకు చెక్

గతంలో జారీ చేసిన రేషన్ కార్డులపై రాజకీయ నేతల బొమ్మలతో రేషన్ కార్డులుండేవి. ఇపుడు ఆ విధానానికి కూటమి సర్కారు చెక్ పెట్టింది. స్మార్ట్ కార్డులపై రాజకీయ నేతల బొమ్మల స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో పాటు లబ్ధిదారుల ఫొటో, కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా కనిపించేలా రేషన్‌కార్డులు ఇప్పటికే చెన్నై కేంద్రంగా ముద్రణ ప్రక్రియ పూర్తయినట్లు సివిల్ సప్లయ్ అధికా రులు చెబుతున్నారు. జిల్లాకు ఈ నెల 25 నుంచి 31 లోగా జిల్లా, మండలాల వారీగా నేరుగా స్మార్ట్ కార్డులను ప్రభుత్వం చేర వేయనుందన్నారు. ఈకార్డులన్నింటినీ సచివాలయ సిబ్బంది, అధికా రులు నేరుగా లబ్ధిదారుల ఇంటికే చేర వేయనున్నట్లు సమాచారం.

పేస్ కళాశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

- రెండు వర్గాలుగా విడిపోయిన డైరెక్టర్లు
- రోడ్డున పడిన విద్యార్థులు
- ఆందోళనకు సీపీఎం, విద్యార్థి సంఘాల మద్దతు



పేస్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పేస్ అకాడమి కళాశాలలో 45 రోజులుగా తరగతులు నిర్వహించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం కళాశాల వద్ద ఆందోళన నిర్వహించారు. పట్టణంలోని విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో నాణ్యమైన విద్యను అందించడానికి గత సంవత్సరం ఏడుగురు డైరెక్టర్లు కలిసి సాయిరాజేశ్వరి కాలనీలో పేస్ అకాడమిని ఏర్పాటు చేశారు. ఇంటర్‌తోపాటు ఐఐటీ, నీట్, జేఈఈ శిక్షణ ఇస్తామని చెప్పడంతో ఫీజులు అధికంగా ఉన్నా తల్లిదండ్రులు తమ పిల్లలను కళాశాలలో చేర్చారు. అయితే పేస్ అకాడమీకి ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అనుమతి లేకపోవడంతో పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇబ్బంది అవుతుందన్న ఉద్దేశ్యంతో టాప్‌మైండ్ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. అయితే పేస్ అకాడమీ పేరుతోనే ఇంటర్మీడియట్ తరగతులను నిర్వహిస్తూ ఐఐటీ, నీట్, జేఈఈ శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల కళాశాల డైరెక్టర్ల మధ్య బేదాభిప్రాయాలు రావడంతో డైరెక్టర్లు రెండు వర్గాలుగా చీలిపోయారు. కొందరు డైరెక్టర్లు పేస్ అకాడమిని, కొందరు అధ్యాపకులను కళాశాలలోని ఫర్నీచర్ మరో చోటికి తరలించారు. తల్లిదండ్రుల ఆందోళనతో కళాశాలలో ఉన్న లొసుగులు వెలుగుచూశాయి. టాప్‌మైండ్ కళాశాలకు ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి ఉన్నా ఐఐటీ, నీట్, జేఈఈ శిక్షణ ఇవ్వకపోవడం ఇబ్బందిగా మారింది. మరోపక్క పేస్ అకాడమి డైరెక్టర్లు ఐఐటీ, నీట్, జేఈఈ శిక్షణ ఇస్తామని పిల్లలను తమ వద్దకు పంపాలని ఒత్తిడి చేస్తున్నారు. అయితే పేస్ అకాడమికి ఇంటర్మీడియట్ బోర్డు అనుమతి లేకపోవడంతో తల్లిదండ్రులు ఎటు తేల్చుకోలేని స్థితిలో ఉన్నారు. ఇంటర్‌తోపాటు ఇతర ప్రవేశ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ ఫీజులు చెల్లించి పిల్లలను పేస్ అకాడమిలో చేర్పించామని... డైరెక్టర్లు తమకు అన్యాయం చేశారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం వరకు డైరెక్టర్లు అందరు కలిసి తమ పిల్లలకు న్యాయం చేయాలని కోరుతున్నారు. వీరి ఆందోళనకు సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు పీటర్, పీడీఎస్‌యూ మాజీ నాయకుడు ఓబులేసులు సంఘీభావం తెలిపారు. అధికారులు కళాశాల నిర్వాహకులపై చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కళాశాల వద్దకు వచ్చిన టు టౌన్ ఎస్ఐ ధనుంజయుడు సెలవుల తర్వాత సమస్యను పరిష్కస్తామని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు ఆందోళన విరమించారు.

ఫిజియోథెరపీ పరికరాల వినియోగంపై శిక్షణ

జమ్మలమడుగు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో గురువారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో గీత, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌బాషా పర్యవేక్షణలో ఫిజియోథెరపిపై నర్సింగ్ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యంవృద్ధుల సంరక్షణలో ట్రిస్ మేనేజ్‌మెంట్ పద్ధతులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఫిజియోథెరపీ పరికరాల సమర్థవంతమైన వినియోగంపై నర్సులకు అవగాహన కల్పించామన్నారు. మానసిక వైద్యురాల డాక్టర్ కవిత మానసిక ఆరోగ్య సమస్యలపై ఒత్తిడిని తగ్గించుకునే పద్ధతులపై సూచనలు ఇచ్చారు. ఫిజయోథెరపిస్టులు డాక్టర్ సమీవుల్లాఖాన్, తదితరులు ఫిజయోథెరపి పరికరాల వినియోగంపై శిక్షణ ఇచ్చారు.

భూ వివాదం కేసులో నలుగురికి జైలుశిక్ష

పోరుమామిళ్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భూవివాదం కారణంగా నమోదైన ఓ కేసులో నలుగురికి రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి పద్మశ్రీ తీర్పు ఇచ్చినట్లు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. వారి వివరాల మేరకు... పోరుమామిళ్ల మండలంలోని చిన్నకప్పలపల్లెలో రెండు కుటుంబాల మధ్య భూ వివాదం నెలకొంది. ఈ కారణంగా అంకాల బంగారు పోలయ్య, వారి తల్లిదండ్రులను చంపాలనే ఉద్దేశ్యంతో అదే గ్రామానికి చెందిన అంకాల పోలయ్య, అంకాల పెద్దగురప్పడు, అంకాల గురప్పడు, అంకాల రామరాజు అనే వారు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనకు సంబంధించి 2018లో నిందితులపై కేసు నమోదైంది. గురువారం బద్వేలు కోర్టులో సివిల్ జడ్జి పద్మశ్రీ తుది విచారణ జరిపి నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించారన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు జైలుశిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారని వారు తెలిపారు. ఈ కేసులో ప్రభుత్వ అడిషనల్ పీపీ శ్రీనివాసులుకు సరైన సాక్ష్యాలు సమర్పించి.. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి కోర్టు హెడ్‌కానిస్టేబులు శ్రీనివాసరెడ్డిని జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పాములేటి మృతదేహం

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరస న్నపల్లె గ్రామానికి చెందిన పాములేటి (44) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పాములేటి తన సొంత పని నిమిత్తం బైకుపై బజారుకు వెళ్లి తిరిగి వస్తుండగా.. మార్గమధ్యంలో ఎద్దుల బండి అడ్డురావడంతో సడెన్ బ్రేకు వేశాడు. దీంతో అదుపు తప్పి కింద పడడంతో హుటాహుటిన 108 వాహనంలో తరలించగా మార్గ మధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు పాములేటి ఇటీవల కువైట్‌కు వెళ్లి నెల క్రితం ఇక్కడకు వచ్చారని.. రెండు మూడు రోజుల్లో తిరిగి కువైట్ వెళ్లాల్సి ఉండగా ఈ సంఘటన జరిగిందని కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఎర్రగుంట్ల పీహెచ్‌సీలో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న జోనల్ మలేరియా అధికారి

ఎర్రగుంట్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల పీహెచ్‌సీని గురువారం మలేరియా జోనల్ అధికారి డాక్టర్ జమాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను, ల్యాబ్ పార్మసీ గదులను పరిశీలించారు. మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున జ్వరాలు అధికంగా వస్తున్నాయని.. తగిన జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జోష్న, సూపర్‌వైజర్ ఓబులేసు సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండోలో బంగారు పతకాలు



తైక్వాండోలో పతకాలు సాధించిన క్రీడాకారులు

పోరుమామిళ్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్ల క్రీడాకారులు మంచి ప్రతిభను చాటి పతకాలు సాధించారు. తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 10వ జాతీయస్థాయి తైక్వాండో పోటీలు విజయవాడలో నిర్వహించారు. ఈ పోటీల్లో వారియర్స్ తైక్వాండో అకాడమీ క్రీడాకారులు షర్ మేన్, నాగదీపిక, హరిచరణ్, గురు జశ్వంత్, అయిల్ బంగారు పతకాలు, వైష్ణవి, షరీఫ్ రజత పతకాలు సాధించినట్లు అకాడమీ నిర్వాహకులు తెలిపారు.

క్రీడా పాఠశాల ప్రవేశ ఫలితాలు విడుదల

కడప స్పోర్ట్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కడప వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4,5 తరగతుల ప్రవేశానికి సంబంధించి గురువారం ఫలితాలు విడుదల చేశారు. ఇటీవల నిర్వహించిన వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అర్హులుగా ప్రకటించారు. ఇందులో కడప జిల్లా నుంచి 16 మంది విద్యార్థినీ విద్యార్థులు ఎంపికయ్యారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఎంపి కైన విద్యార్థులు ఈనెల 21న గురువారం క్రీడాపాఠశాలకు హాజరై సంబంధిత డాక్యుమెంట్లు అందించాలని క్రీడాపాఠశాల ప్రత్యేక అధికారి జగన్నాధరెడ్డి తెలిపారు.

ఎంపికైన 4,5 తరగతుల విద్యార్థులు వీరే..

డి.అర్జున్, డి.మోక్షగణేశ్, దివాన్‌షైపు, ఎం.జస్విక్, బి.విష్ణు వర్ధన్‌రెడ్డి, ఇర్ఫాన్, కౌశల్ చంద్, ఏపీ విష్ణువర్ధన్‌రెడ్డి, టి.కశ్యప్, జి.దినేష్‌కుమార్, ఏఎం వైభవి, టీఎస్ నివేదిత, పి.హరిణి, వై.మోక్షిత, బి.నారాయణి ప్రియ, కె.లేవికారెడ్డిలు ఎంపికయ్యారు. అలాగే అన్నమయ్య జిల్లా నుంచి ఎ.వైష్ణవి, ఎం.గంగా హర్షిణి ఎంపికైన వారిలో ఉన్నారు.

వర్ణకుమార్‌రెడ్డికి డాక్టరేట్



పులివెందుల రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పి.జి.వర్ణకుమార్‌రెడ్డికి డాక్టరేట్ దక్కింది. చెన్నైలోని వేల్స్ యూని వర్సిటీలో ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ ఎం.మీనా ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో టెస్ట్‌బెడ్ ఉపయోగించి ఆటోమేటిక్ మాడ్యులేషన్ క్లాసిఫికేషన్ కోసం మిషన్ లెర్నింగ్ మరియు డీప్ లెర్నింగ్ అల్గోరిథమ్‌ల అభివృద్ధి అనే అంశంపై ఆయన పరిశోధన పూర్తిచేశారు. ఈ పరిశోధనలో, ఆధునిక వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థల్లో మాడ్యులేషన్ గుర్తింపుని వేగవంతం చేయడం, ఖచ్చితత్వం పెంచడం, సాఫ్ట్ వేర్ డిఫైన్డ్ రేడియో (ఎస్‌డీఆర్) ఆధారిత పరీక్ష వేదిక ద్వారా వాస్తవ పరిసరాలలో ఈ అల్గో రిథమ్‌ల పనితీరును పరీక్షించారు. ఇందుకు ఆయన డాక్టరేట్ అందుకున్నారు. ఈసందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆయనను అభినందించారు.

బ్యాండ్ బాజాలు మోగిస్తే నికాహ్ చేయం

మత గురువుల తీర్మానం

రాయచోటిటౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఇస్లాం మతానికి విరుద్ధమైన బ్యాండు బాజాలు మోగించడం, ఆర్కెస్ట్రా పెట్టడం, బాణా సంచాలు కాల్చడం, ట్రాన్స్‌జెండర్స్ లాంటి వ్యక్తులతో డ్యాన్సులు నిర్వహిస్తే అలాంటి పెళ్లిలో నికాహ్ చేయమని రాయచోటి పట్టణ సర్కాజీలు తీర్మానించారు. బుధవారం రాత్రి పట్టణంలోని పాతరాయచోటి మసీదులో మత గురువు షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో సర్కాజీలు మౌలానీ సలీం, ముఫ్తీ హబీబుర్ రెహమాన్, మౌలానా షబ్బీర్, మౌలానా అబ్దుల్ వాహిద్, హఫీజ్ అమీనుల్లాలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఇస్లాం మతానికి పూర్తి విరుద్ధంగా ముస్లింలు పెళ్లిళ్లు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాండు బాజాలు, బాణాసంచాలు, ఆర్కెస్ట్రా, ట్రాన్స్‌జెండర్లతో డాన్సులు నిర్వహించడం వంటి కార్యక్రమాలతో డబ్బు వృధా కావడమే కాకుండా ఇస్లాం మతానికి విరుద్ధమని, ఇలాంటి సాంస్కృతి కొనసాగిస్తే పేద ముస్లింల పెళ్లిళ్లు జరగడం కష్టతరం అవుతుందన్నారు. చాలామంది పేద కుటుంబాల్లో పెళ్లిళ్లు జరగక పోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయని వారు ఆవేదన చెందారు. దీనికి రాయచోటిలో ఇద్దరు అక్కచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకోవడమే నిదర్శమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నేతలు బుల్లెట్ మహబూబ్‌బాషా, జిన్నాషరీఫ్, ఆడిటర్ మన్సూర్‌అలీఖాన్, సయ్యద్ రియాజుద్దీన్, చెన్నూరు మస్తాన్‌వలి పాల్గొన్నారు.

టిప్పర్ ఢీ.. ఇద్దరు మహిళల మృతి

- శుభకార్యానికి వెళుతుండగా ప్రమాదం
- మృతులు అన్నదమ్ముల భార్యలు



ప్రమాదంలో మృతి చెందిన సుహాసిని, గాయత్రి (ఫైల్ ఫొటోలు)

ఎర్రగుంట్ల / ముద్దనూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వెళుతూ అన్నదమ్ముల భార్యలు దుర్మరణం చెందిన సంఘటన గురువారం కల మల్ల వద్ద చోటుచేసుకుంది. కలమల్ల ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు ముద్దనూరు మండలంలోని కొసినేపల్లికి చెందిన వెంకటేష్, వెంకటరమణలు తమ భార్యలతో కలిసి మోటార్‌సైకిళ్లలో పెళ్లికి వెళ్లేందుకు ఎర్రగుంట్లకు బయలుదేరారు. మార్గమధ్యలో కలమల్ల వంకపై నిర్మించిన బ్రిడ్జి వద్ద కు వెళ్లగానే ఫ్లయాష్‌తో వెళుతున్న టిప్పర్ ఢీకొంది. దీంతో వెంకటేష్ భార్య గుడ్డోళ్ల గాయత్రి (25), వెంకటరమణ భార్య గుడ్డోళ్ల సుహాసిని (35) టిప్పర్ కిందపడటంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. గాయత్రి తల నుజ్జునుజ్జు అయ్యింది. వెంకటేష్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు సమాచారం. టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మృతుల బంధువుల ఆందోళన : వెంకరమణ, వెంకటేష్‌లు ఆర్టీపీపీలో పనిచేస్తున్నారు. వారిద్దరి భార్యలు మృతి చెందడంతో బంధువులు అక్కడకు చేరుకొని బోరున విలపించారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో మూడు గంటలపాటు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ, వైసీపీకి చెందిన నాయకులు, ఆర్టీపీపీ ఉద్యోగకార్మికులు పెద్దఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి అక్కడకు చేరుకుని టిప్పర్ యజమానితో మాట్లాడి పరిహారం ఇప్పించేందుకు ఒప్పించడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతదేహం వద్ద గుమికూడిన బంధువులు, ఆర్టీపీపీ ఉద్యోగులు

కొసినేపల్లిలో విషాదఛాయలు

ముద్దనూరు మండలం కొసినేపల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని అన్నదమ్ముల భార్యలు సుహాసిని, గాయత్రిలు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి. గాయిత్రికి ఏడాదిన్నర కవలలు పిల్లలు ఉన్నారు. సుహాసినికి బీటెక్, ఇంటర్ చదివే కుమారులు ఉన్నట్లు బంధువులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ ప్యానెల్

సింహాద్రిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ప్రభుత్వం ఉచితంగా సోలార్ ప్యానెళ్లను వారి ఇంటిపైన ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దినేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సర్వీస్‌తో పాటు సిమెంటు స్లాబ్ ఇల్లు కలిగినవారు అర్హులన్నారు. విద్యుత్ సర్వీస్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్ కాపీలను విద్యుత్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

టీడీపీ కార్యాలయం వద్ద సంబరాలు

- నా గెలుపునకు కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు
- పులివెందుల జడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి లతారెడ్డి


జడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి లతారెడ్డికి కేక్ తినిపిస్తున్న టీడీపీ మహిళా కార్యకర్తలు

పులివెందుల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. గురువారం పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) సతీమణి లతారెడ్డి పులివెందుల జడ్పీటీసీగా గెలుపొందారు. ఈ గెలుపుతో కూటమి నేతలలో సంబరాలు అంబరాన్నంటాయి. సాయంత్రం 4గంటల ప్రాంతంలో పార్టీ కార్యాలయానికి చేరుకున్న జడ్పీటీసీ లతారెడ్డికి ఘనస్వాగతం పలికారు. బాణసంచా పేల్చి హారతులు ఇచ్చి స్వీట్లు తినిపించారు. అలాగే కేక్‌ను కూడా కట్ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ లతారెడ్డి మాట్లాడుతూ తన గెలుపునకు కృషి చేసిన కూటమి నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల బరిలో దిగినప్పటి నుంచి తన వెంట నడిచిన నాయకులకు, కార్యకర్తలకు ఈ విజయం అంకితం చేస్తున్నామన్నారు. లతారెడ్డి విజయం పట్ల టీడీపీ నాయకులు, బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, వాజ్‌పేయి, విజయలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

సింహాద్రిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం 12(1)సీ ప్రకారం పేదలు, బలహీన వర్గాల కుటుంబాల్లోని పిల్లలకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో 25 శాతం సీట్లకు గాను 2025-26 విద్యా సంవత్సరానికి మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యా శాఖాధికారి ఖాదర్ బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గాలకు 10శాతం, ఎస్టీలకు, ఇతర కులాల్లోని బలహీన వర్గాలకు 4శాతం, హెచ్‌ఐవీ, అనాథ, దివ్యాంగుల కేటగిరి వారికి 5శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. అర్హులైనవారు ఈనెల 20వ తేదీ వరకు ప్రభుత్వ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో సూచించారు.

మిగులు సీట్లకు దరఖాస్తు చేసుకోండి

పులివెందుల రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేటు పాఠశాలల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి రామానాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో 25శాతం సీట్లు కేటాయించిన ఉచిత సీట్లకు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత కుటుంబాలకు సంవత్సర ఆదాయం రూ.1.20లక్షలు, పట్టణ ప్రాంతం కుటుంబాలకు రూ.1.44 లక్షల లోపు ఉన్న పిల్లలకు అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు టోల్‌ఫ్రీ 1800-4258-599 నెంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్య కోసం అర్హత కలిగిన పిల్లలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి నరసింహులు, ఎంఈవో-2 అనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లు పూర్తైన పిల్లలకు ప్రథమ తరగతిలో మిగిలిన 25సీట్ల భర్తీ కోసం ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు.

రేపు శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు

కడప మారుతీనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ క్రిష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) కడప శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16, 17వ తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ కడప శాఖ ప్రతినిధులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ నగరంలోని వై-జంక్షన్ సమీపంలో ఉన్న అష్టలక్ష్మి కళ్యాణ మండపంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16న ఉదయం మహా మంగళహారతితో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. మహామంత్ర ధ్యానం, దర్శన భారతి, గోపూజ, కలశాభిషేకం, సాయంత్రం హరికథ, మహాహారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. పది సంవత్సరాల్లోపు చిన్నారులను శ్రీకృష్ణ, రాధాగోపిక అలంకారాలతో తీసుకురావాలన్నారు. 17న ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీసీల 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి

కడప మారుతీనగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బీసీల న్యాయమైన హక్కుల సాధన ఈనెల 18, 19వ తేదీలలో తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకుడు చిట్టిబోయిన సుబ్బరాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక సంఘ జిల్లా కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీల న్యాయమైన హక్కుల కోసం, అలాగే బీసీలకు రావలసిన వాటాల కోసం బీసీలు ఏకతాటి పైకి రావాలన్నారు. ఎన్ని ఆటోపోట్లు ఎదురైనా పోరు సాగిస్తామన్నారు. జిల్లాలోని బీసీలందరూ తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ నాయకులు సుబ్బరాయుడు, క్రిష్ణమూర్తి, శ్రీనివాసులు, బాబు, రాజ్‌కుమార్, అచ్చయ్య పాల్గొన్నారు.

కేంద్ర బలగాల సమక్షంలో ఎన్నికలు నిర్వహించాలి

- అప్రజాస్వామిక ఎన్నికలు జరిపి సంబరాలా..?
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలను రద్దు చేసి కేంద్ర బలగాల సమక్షంలో నిర్వహించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అప్రజాస్వామికంగా ఎన్నికలు జరిపి టీడీపీ సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎన్నో జడ్పీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నా కొన్ని స్థానాలకు మాత్రమే ఎన్నికలు నిర్వహించారన్నారు. బీహార్ రాష్ట్ర తరహాలో పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక జరిగిందన్నారు. ఆయుధాలను చూపి ప్రజలను బెదిరించి ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడ్డారని, ఎన్నికల్లో కలెక్టర్ సమక్షంలోనే దొంగ ఓట్లు వేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యం గెలిచిందని అదే ఫోటోలను పోస్ట్ చేస్తూ లోకేశ్ ట్వీట్ చేశారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఎంత దారుణంగా ఖూనీ చేశారో అక్కడే అర్థమైందన్నారు. ప్రజలు ఓటు వేసేందుకు వస్తుంటే రాకుండా పోలీసులు అడ్డుకున్నారన్నారు.

ఎస్ఐ ప్రకాశ్‌రావుకు ప్రతిష్టాత్మక సేవా పతకం



కడప క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది చేస్తున్న సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక విశిష్ట సేవా పతకాన్ని కడప సీసీఎస్ ఎస్ఐ బి.ప్రకాశ్‌రావుకు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్‌కుమార్ ఎస్ఐ ప్రకాశ్‌రావును ప్రత్యేకంగా అభినందించారు. ప్రకాశ్‌రావు 1984లో జిల్లా పోలీసుశాఖలో కానిస్టేబులుగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో పులివెందుల, మైదుకూరు, మన్నూరు, ప్రొద్దుటూరు, కడప ట్రాఫిక్, కడప వన్‌టౌన్ తదితర పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వర్తించి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. అంకితభావంతో విధులు నిర్వహించినందుకు తన సర్వీసులో మొత్తం 45 నగదు రివార్డులు, 38 జీఎస్ఈలను ఉన్నతాధికారుల నుండి అందుకున్నారు.

ఎన్నో పోరాటాల ఫలితమే స్వాతంత్ర్యం : డీఈవో


జాతీయజెండాతో మానవహారం నిర్వహించిన నారాయణ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎందరో మహనీయుల ప్రాణత్యాగం, ఎన్నో పోరాటాల ఫలితమే ప్రస్తుతం మనం 78సంవత్సరాలుగా అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని డీఈవో షంషుద్దీన్ అన్నారు. గురువారం నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ జెండా ర్యాలీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నారాయణ విద్యాసంస్థల ఏజీఎం శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, కాలేజీ కోర్ డీన్ చంద్రకిశోర్, ఆర్ఎస్‌టీ సంతోష్‌లతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. 150 మీటర్ల మువ్వన్నెల జెండాతో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు రాజారెడ్డి వీధి నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ పాఠశాల కవితరెడ్డి, ఏవో హేమంత్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి, విజయ్, అకడమిక్ డీన్ ప్రదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్, ఏవో, అధికారులు, విద్యార్థులు

వేంపల్లె, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో గురువారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. సుమారు 300మంది విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్తా మాట్లాడుతూ ఆనాటి అమరవీరుల త్యాగమే ఈనాడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని, ప్రతి ఒక్కరూ దేశం పట్ల భక్తి, శ్రద్ధలతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఏవో పెనుగొండ రవి, ఎఫ్‌వో కోటేశ్వరి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దీప్తి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు సత్యానందం, గోవర్ధన్, అనిత, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

కమలాపురం రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో సూర్యహైస్కూలులో గురువారం ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణ, రాధా గోపికల వేషధారణలు వేసి అలరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో రాధాకృష్ణుల విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు కరస్పాండెంట్ టీవీ సుబ్బారెడ్డి బహుమతులు అందించారు.

జాతీయ పతాకాలు పంపిణీ



కడపక్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సూచనల మేరకు కడప జనసేన నేత జీవీ రమణ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 500 జాతీయ జెండాలను విద్యార్థులకు కమిషనర్ మనోజ్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సాయిసిద్దు, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుతో నేల నిర్మాణం మెరుగు


వర్మీకంపోస్టు తయారీ విధానాన్ని తెలుసుకుంటున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

పులివెందుల రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో వర్మీ కంపోస్టు వాడడం వలన నేల నిర్మాణం మెరుగవుతుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం పట్టణంలోని వర్మీకంపోస్టు ఉత్పత్తి కేంద్రాన్ని కళాశాల జంతుశాస్త్రం విభాగం విద్యార్థినులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర పర్యటన వలన ప్రత్యక్షంగా విజ్ఞానాన్ని నేర్చుకోగలరన్నారు. కృషి విజ్ఞాన క్షేత్రం అధినేత పాలెం చంద్ర మాట్లాడుతూ పేడ, పంట అవశేషాలను బెడ్ లాగా చేసి అందులో వానపాములను వేసి వర్మీ కంపోస్టును తయారు చేయవచ్చన్నారు. వర్మీ కంపోస్టు మొక్కలకు పోషకాలను అందించడంతో పాటు మొక్కల పెరుగుదలకు సహాయపడుతుందన్నారు. నేలలో సూక్ష్మజీవులు నివసించడానికి అనుకూలంగా ఉంటుందని, నీటిని నిలుపుకొనే సామర్థ్యం నేలకు పెరుగుతుందన్నారు. దీంతో పాటు భవిష్యత్తులో వర్మీ కంపోస్టు ఎరువు తయారీ స్వయం ఉపాధిగా కూడా చేసుకొని అనేక మందికి ఉద్యోగ అవకాశాలను కల్పించవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.బాలనారాయణ, జువాలజీ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనిత, జనార్దన, బి.ప్రవళిక పాల్గొన్నారు.

డిపాజిట్ కోల్పోయిన వైసీపీ అభ్యర్థి

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్


మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలిచిందని, ఈ ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థికి డిపాజిట్లు కూడా గల్లంతయ్యాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. గురువారం కడప నగరంలోని హరిటవర్స్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పులివెందులలో జగన్‌ది బలుపు అనుకున్నామని కానీ అది వాపు అని ఈ ఎన్నికలతో తెలిసిపోయిందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో కనీసం నామినేషన్ కూడా వేయకుండా దౌర్జన్యంగా దాడులు చేశారని, ఆ విధంగా గెలిచారని, ఇపుడు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిపితే చతికిలపడ్డారన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి గంధం ప్రసాద్ పాల్గొన్నారు.

పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది

కమలాపురం రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం విజయం సాధించిందని ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా, టీడీపీ సీనియర్ నాయకుడు వాసుదేవరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించడంతో కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆగస్టు 1న గండికోట పర్యటనలో భాగంగా పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని గెలుచుకుని రావాలని చెప్పడంతో ఇచ్చిన మాట ప్రకారం జడ్పీటీసీ గెలుపొంది ముఖ్యమంత్రికి బహుమతిగా ఇచ్చామని తెలిపారు.

కాంగ్రెస్‌పై జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

- కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి

వేంపల్లె, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీపైన, కాంగ్రెస్ పార్టీ పైన జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు హాట్‌లైన్‌లో మాట్లాడుకుంటారని, అందువల్ల ఆంధ్రాలో దొంగ ఓట్లపై రాహుల్‌గాంధీ మాట్లాడడం లేదని, అసలు కాంగ్రెస్ ఒక పార్టీయేనా అని వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించడం అవివేకం, అజ్ఞానం అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను 52 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పరిపాలించిందని, వైసీపీ కేవలం ఐదు సంవత్సరాలు మాత్రమే పాలించిందన్నారు. జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరుసార్లు ఎమ్మెల్యేగా, నాలుగుసార్లు ఎంపీగా, రెండుసార్లు ముఖ్యమంత్రిగా, రెండుసార్లు పీసీసీ అధ్యక్షుడిగా, ఒకసారి సీఎల్పీ లీడర్‌గా ఏ పార్టీ నుంచి ఎన్నికయ్యారో చెప్పాలని, అసలు జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ఏ పార్టీ నుంచి ప్రారభమైందో చెప్పాలని ప్రశ్నించారు. ఆకాశం మీద ఉమ్మివేస్తే అది తిరిగి మీ ముఖం మీదే పడుతుందన్న నగ్నసత్యాన్ని గ్రహించాలని హితవు పలికారు.

విద్యార్థులు సేవా భావంతో మెలగాలి

కడప మారుతీనగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతగా సేవాభావంతో మెలగాలని టీడీపీ తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర కన్వీనరు మడక చక్రధర్ సూచించారు. హ్యాండ్స్ ఫర్ యూ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మహిళా జూనియర్ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశంలాంటి పుణ్యభూమిలో పుట్టడం చాలా అదృష్టంగా భావించాలన్నారు. కార్యక్రమంలో హ్యాండ్స్ ఫర్ యూ వ్యవస్థాపకుడు పట్టుపోగుల సుబ్బారావు, ఆ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు పాల్గొన్నారు.

పాఠశాలకు డ్రమ్స్ బహూకరణ

సీకేదిన్నె, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అంగడివీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు ఎంతః సుకుమారి రూ.12 వేలు విలువచేసే మార్చ్‌ఫాస్ట్ డ్రమ్స్ అందించారని ఆ స్కూలు ప్రధానోపాధ్యాయురాలు సుజాత, పీడీ అగ్గిరప్ప తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ పాఠశాల అభ్యున్నతికి పాటుపడుతూ పాఠశాల వేడుకలకు అవసరమైన డ్రమ్స్ బహూకరించడంతో పాటు పేద విద్యార్థులకు సైతం ఆర్థికసాయం అందిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా కొనియాడారు. ఉపాధ్యాయులు సుకుమారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సుకుమారిని అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.


పాఠశాలకు డ్రమ్స్ బహూకరిస్తున్న ఉపాధ్యాయురాలు సుకుమారి

సీపీఐ సభలను జయప్రదం చేయాలి

పోరుమామిళ్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ తెలిపారు. గురువారం పోరుమామిళ్లలో వారు మాట్లాడుతూ ఈ నెల 23న ఒంగోలులో 22వ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

జడ్పీటీసీల విజయంపై టీడీపీ సంబరాలు

జమ్మలమడుగు/మైదుకూరురూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యుల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించడంతో ఆపార్టీ నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. జమ్మలమడుగులో గురువారం టీడీపీ కార్యాలయం ఎదుట టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అలాగే పులివెందుల జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి ఘన విజయం పొందినందుకు కూటమి నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా మైదుకూరులో టీడీపీ నాయకులు గురువారం బాణసంచా పేల్చి,స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ పులివెందుల ప్రజలు స్వచ్ఛందగా బయటకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ మైదుకూరు పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పాశం మారుతి, టీడీపీ రాష్ట్ర రైతు సంఘం నాయకులు ధనపాల జగన్, బండి అమర్‌నాథ్, పెంచల్ తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు టీడీపీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చుతున్న కార్యకర్తలు

పులివెందుల తీర్పు జగన్‌కు చెంపపెట్టు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలు తెలుగుదేశం పార్టీ గెలుపొందడం జగన్‌కు చెంపపెట్టని ఆ పార్టీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ పేర్కొన్నారు. రెండు జడ్పీటీసీ స్థానాలను తెలుగుదేశం పార్టీ గెలుపొందిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందులలో 30 సంవత్సరాలుగా జగన్ ప్రజలను ఓటుకు దూరం చేశారని విమర్శించారు. ఈ ఎన్నికల ఫలితాలు జగన్ అహంకారానికి, ఆధిపత్యాన్ని సవాల్ చేస్తూ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారన్నారు.కార్యక్రమంలో నందమూరి యువసేవా సమితి అధ్యక్షుడు గోమేధికం సుదర్శన్, జనసేన నాయకుడు బాలసుబ్రమణ్యం, వెంకటరమణ, చంద్రమోహన్‌రెడ్డి, రమణారెడ్డి, బాలరాజు, ప్రవీణ్, టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సురేష్, వెంకటేష్, బాషా పాల్గొన్నారు.

ఖాజీపేటలో: మండల పరిధిలోని కొత్తపేట జాతీయ రహదారిపై టీడీపీ నాయకులు వాకమల్ల వెంకటరామిరెడ్డి, రెడ్యం వెంకట్రామిరెడ్డిల ఆధ్వర్యంలో టపాసులు కాల్చి కార్యకర్తలకు, ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. పులివెందుల ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందని వారు ఓటుతో వైసీపీకి బుద్ధిచెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట, చెముళ్లపల్లె టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో చైర్మన్‌గా పురుషోత్తంరెడ్డి

పెద్దముడియం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దముడియం మండల సహకార బ్యాంకు సింగిల్‌విండో చైర్మన్‌గా చిన్నముడియం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు లక్కిరెడ్డి పురుషోత్తంరెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు పురుషోత్తం రెడ్డిచే సీఈవో మాబుసాని, ఇతర అధికారులు పెద్దముడియం సహకార బ్యాంకు కార్యాలయంలో ప్రమాణ స్వీకారంచేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు నారాయణరెడ్డి, శివనాథరెడ్డిలకు మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, రామలింగారెడ్డి, డీసీసీ బ్యాంకు మేనేజరు సి.చెన్నక్రిష్టారెడ్డి, సూపర్‌వైజరు ఆమ్రపాళి, పాల్గొన్నారు.

మైదుకూరు చైర్మన్‌గా మారుతి

మైదుకూరు రూరల్, ఆగస్ట్ 14(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా పాశం మారుతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ప్రాథమిక వ్యవసా య సహకార సంఘంలో చైర్మన్‌గా మారుతితో పాటు డైరెక్టర్లుగా నరసిహులు యాదవ్, చిన్నకొండారెడ్డి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. సీఈఓ భాస్కర్ వారితో సంతకాలు తీసుకొన్నారు.

20 దాకా గ్రీవెన్స్‌కు అవకాశం

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అన్నదాతా సుఖీభవ పథకానికి సంబంధించి రైతులకు డబ్బులు ఖాతాల్లో పడకుంటే సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో గ్రీవెన్స్ నమోదు చేసుకోవడానికి ఈనెల 20వ తేదీవరకు గడువు ఉందని ప్రొద్దుటూరు డివిజన్ ఏడీఏ అనిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి సంబంధించి ఇప్పటికే మొదటి విడత డబ్బులు ఆగస్టు 2వ తేదీ నుంచి విడుదలైన విషయం అందరికి తెలిసిందే. అర్హులైన రైతులకు డబ్బులు పడకుంటే 20వ తేదీలోపు గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఏడీఏ కోరారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకుని శ్రీ వెంకటేశ్వర పశువైద్య విద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ , తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరులో: ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి అన్నారు. గురువారం హర్‌తిరంగాలోభాగంగా విద్యార్థులతో జాతీయ జెండాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు.

మైదుకూరు రూరల్‌లో: ప్రతి ఇంటిపై జాతీయ జెండా పెట్టుకొని దేశ ఐక్యతను చాటుదామని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సుబ్బరాయుడు తెలిపారు.స్థానికపాత మున్సిపల్ ఆఫీసు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణజన్మాష్టమిని పురష్కరించుకుని ఓంశాంతి భవన్‌లో చిన్నారులకు వేసిన రాధాకృష్ణుల వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ఓంశాంతి భవన్ నిర్వాహకురాలు బ్రహ్మకుమారి శాంత మాట్లాడుతూ శ్రీకృష్ణుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణకోసం అవతరించారన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు, మహిళలు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

బద్వేలు రూరల్. ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మండలాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకెళ్తానని ఎంపీపీ బిజివే ముల రమణమ్మ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని సభాభవనంలో ఎంపీడీవో మల్లీశ్వరి ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలో ఉన్న సమస్యలను పరి ష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వంకెల పోలిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బద్వేలుటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం రసాభాసగా జరిగింది. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాదారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే డాక్టర్ సుధా హాజరయ్యారు. తొలుత మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అజెండాను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధా, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డిలు మాట్లాడుతూ మున్సిపల్ అభ్యున్నతికి కృషి చేయాలని, ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా అందరికీ సమన్యాయం చేయాలని సూచించారు. కాగా ప్రజలు నివాసం ఉండేప్రాంతాల్లో రోడ్లు వేయించాలి తప్ప, నివాసాలు లేనిచోట్ల రోడ్లు వేయించడం ఏమిటని మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గోపాల స్వామి, సాయిక్రిష్ణలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సి.రామాపురంలో గత కొన్నేళ్లుగా నీటి సమస్య ఉందని, పలుమార్లు సమావేశం దృష్టికి తీసుకు వచ్చినా ఎందుకు పూర్తి చేయలేదని ఎమ్మెల్యే సుధా అధికారులను ప్రశ్నించారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో సభ్యులు సమస్యలను విన్నవించుకోవడం తప్ప, పరిష్కరించిన పాపాన పోలేదని వాటిపై దృష్టిసారించి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సుధా అధికారులకు సూచించారు. వీధిదీపాలు, తాగునీటి సమస్య, సీసీరోడ్లు, కుక్కలు, పందుల స్వైర విహారాలపై కౌన్సిల్ సమావేశం రసాబాసగా మారింది. స్పందించిన మున్సి పల్ కమిషనర్ నరసింహారెడ్డి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

'దేశం అంతా రాహులగాంధీ వైపు చూస్తోంది'

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దేశమంతా రాహుల్‌గాంధీ వైపు చూస్తోందని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాషా అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూమాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి రాహుల్‌గాంధీ మీద చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసి రాజకీయ సాంప్రదాయాలు తెలిసి ఇలా మాట్లాడడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. మాణిక్యం ఠాగూర్ ఒక పార్లమెంటు సభ్యుడు. అలాంటి వ్యక్తిని వాడు వీడు అని సంబోదించడం ఎంతవరకు సబబో అతని విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. 2029లో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని, ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తారన్నారు.

ఈ రోడ్డును కాస్త పట్టించుకోండి



రోడ్డు పొడవునా గుంతల్లో నిలిచిన వర్షపునీరు

జమ్మలమడుగు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని తాడిపత్రి- కోవెలకుంట్ల వెళ్లే రోడ్డులో మూడు రోడ్ల కూడలి వద్ద గుంతలు పడి వర్షపునీరు నిలిచి తీవ్ర అసౌకర్యంగా మారింది. దీంతో కోవెలకుంట్ల రోడ్డు నుంచి ద్విచక్ర వాహనాల్లో వెళ్లేవారు రోడ్డు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే బస్సులు, ఇతర భారీ వాహనాలు వెళ్లేటపుడు గుంతల్లో నిలిచిన నీరు వాహనదారులు, పాదాచారులపై పడి ఇబ్బందులు కలుగుతోందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రత్యేక చొరవ చూపి రోడ్డుపై పడిని గుంతలుపూడ్పించేలా వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండండి

మైదుకూరు రూరల్, ఆగస్ట్ 14(ఆంధ్రజ్యోతి) :మైదుకూరు పట్టణంతోపాటు మండలంలోని నివశించే వారు దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని మైదుకూరు అర్బన్ సీఐ రమణారెడ్డి సూచంచారు. స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో దొంగతనాలపై గురువారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సీఐ మాట్లాడుతూ సెలవు రోజుల్లో ఎవరైనా ఎక్కడికైన ప్రయాణాలు చేయాలనుకొనే వారు ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. విలువైన వస్తువులు ఇంట్లో లేకుండా చేసుకోవాలని తెలిపారు విద్యార్థులకు సోషియల్ మీడియాపై అవగాహన కల్పించారు.